క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు యుగేందర్, ప్రియాంక మాట్లాడుతూ.. సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సీపీఆర్‌తో గుండెపోటుకు గురైన వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, తహసీల్దార్ లాల్‌బహదూర్, సర్పంచ్ గోర్ల సైదమ్మ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న దుకాణ యజమానులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని పాలకేంద్రం షాపింగ్ కాంప్లెక్స్–2 ఎదుట అక్రమంగా రోడ్డుపై నిర్వహిస్తున్న కూరగాయల దుకాణాలను తొలగించాలని కోరుతూ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణ యజమానులు మంగళవారం ఎంపీడీఓ బాలరాజురెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డుపై అక్రమంగా, కాంప్లెక్స్ ఎదుట కూరగాయల వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, దీంతో కాంప్లెక్స్‌లోని దుకాణాలకు ప్రజలు రాకపోవడంతో వెలవెలబోతున్నాయని, దుకాణ కిరాయి కట్టలేని పరిస్థితి ఉందని వారు వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో చిరంజీవి, గ్యార యాదగిరి, రమేశ్, మహేశ్, మురళీ, జనార్దన్‌రావు, ద్రోణాచారి, రవి, రాజు తదితరులున్నారు.

దుకాణాల్లో తూనికలు కొలతల అధికారుల తనిఖీ



హిల్‌కాలనీలోని ఎలక్ట్రికల్ షాపులో వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పలు దుకాణాల్లో తూనికల, కొలతల అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూకం వేసే కాంటాలతో పాటు ప్యాకింగ్‌తో వచ్చిన వస్తువుల బరువులను పరిశీలించారు. ప్రతి సంవత్సరం షాపులను తనిఖీ చేసి తూకం వేసే కాంటాలను పరిశీలిస్తామని తెలిపారు. తనిఖీల్లో వి.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు, పంచాయతీ సిబ్బంది

కొండమల్లేపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మండల కేంద్రంలోని పాత ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఇరువైపులా ఉన్న దుకాణాలను మంగళవారం గ్రామపంచాయతీ అధికారులు పోలీసుల సహకారంతో తొలగించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగానే దుకాణాలను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి వీరబాబు తెలిపారు.

సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



డీపీఓకు ఫిర్యాదు చేస్తున్న వార్డుసభ్యులు

మాడుగులపల్లి : పంచాయతీ తీర్మాణం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్న మాడుగులపల్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు వార్డుసభ్యులు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. నాలుగు నెలలుగా గ్రామసభ నిర్వహించకుండా ఇష్టానుసారంగా తీర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. పాలకవర్గం అనుమతి లేకుండానే పంచాయతీ భవనం కూల్చారని, ఓ రైస్‌మిల్లుకు రెన్యువల్, కాంట్రాక్టర్ వ్యాపారాలకు అనుకూలంగా అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామసభ నిర్వహించకుండా అలసత్వం వహించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న సర్పంచ్, సహకరించిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీలకు వేతనాలు పెంపు

- రూ.15పెంచిన కేంద్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే తీపికబురు ఇచ్చింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రోజు వారి వేతనాన్ని పెంచుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పెరిగిన కూలీ రేట్లు ఈనెల ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. మండలంలో మొత్తం 34గ్రామపంచాయతీల్లో 32,895 జాబ్ కార్డులు ఉన్నాయి. 13,327 మంది కూలీలు ఉన్నారు. ఉపాధిహామీ కూలీ రేట్లు ప్రభుత్వం పెంచడంతో మండలంలో పనిచేస్తున్న సుమారు ఎనిమిది నుంచి తొమ్మిది వేయి మందికి ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో రోజు వారి ఉపాధిహామీ పనికి హాజరయ్యే కూలీల సంఖ్య గత రెండు వారాల కంటే ప్రస్తుతం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రూ.257 నుంచి 272 పెంపు..

ఉపాధిహామీ పనుల్లో భాగంగా ప్రస్తుతం ఫీడర్ చానల్, హరితహారంలో మొక్కల సంరక్షణ, చేపల చెరువులు, చెరువుల్లో పూడికతీత, వర్షపునీరు వడిసి పట్టేలా గుంతల తవ్వకం వంటి పనులు చేపడుతున్నారు. ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీ నిర్ణీత సమయంలో పనిచేసేవారికి రోజుకు రూ.257ఉండగా తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం రోజుకు రూ.15పెంచడంతో రూ.257నుంచి రూ.272 చెల్లించనున్నారు.

పనులు సద్వినియోగం చేసుకోవాలి



“ కూలీలు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం ఉన్న కూలీ కంటే రూ.15 కేంద్ర ప్రభుత్వం అదనంగా పెంచింది. నిరుపేద కూలీలకు ఇది ఊరటనిచ్చే అంశం. నిర్ణీత సమయంలో పనికి వచ్చినట్లయితే పూర్తి కూలీల వచ్చే అవకాశం ఉంటుంది. కూలీలు పనులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీరాములు, ఇన్‌చార్జ్ ఏపీఓ, తిరుమలగిరి

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట : నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పొగిళ్ల, కంబాలపల్లి, పాత కంబాలపల్లి, బొల్లారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మన ఊరు–మన బడి, గ్రామాలకు బీటీరోడ్లు, మారుమూల ప్రాంతాల్లో ప్రజల రవాణా సౌకర్యం కోసం కొన్ని కోట్లు వెచ్చించి బీటీ రోడ్లు, వంతెనలు నిర్మిస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో రూ.9కోట్లతో బీటీ రోడ్ల పనులకు, అలాగే బొల్లారం రూ.5కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. అనంతరం పలువురు రైతులకు డి–ఫారెస్ట్ భూములకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, ఎంపీడీఓ రాములునాయక్, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ బుజ్జి, సర్పంచ్‌లు రోజారవినాయక్, ముత్యాలరాములమ్మ, మద్దిమడుగు రవి, పార్టీ మండల అధ్యక్షుడు సర్వయ్య, గోవిందుయాదవ్, మల్లారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అనంతగిరి, మోహన్‌కృష్ణ, పీఆర్‌డీఈ లింగారెడ్డి, ఏఈఈ రాజునాయక్, వెటర్నరీ డాక్టర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని పలువార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం ఎమ్మెల్యే నోముల భగత్ పర్యటించారు. వార్డులోని ప్రజలను పలకరిస్తూ, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పలు వార్డుల్లో బుల్లెట్ వాహనంపై కలియ తిరుగుతూ వార్డుల్లో జరుగుతున్న సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు వార్డు ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. టెక్నికల్ సమస్యతో ఆగిపోయిన అభివృద్ధి పనులను అక్కడికక్కడే ఎమ్మెల్యే ఫోన్‌లో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ ప్రసాద్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, కోఆప్షన్ సభ్యులు చాపల సైదులు, డోమినిక్, షేక్ అన్వర్, ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు పెద్దసైదులు, ఎల్లయ్య, సైదులు, యూత్ అధ్యక్షుడు సైదాచారి, ప్రధాన కార్యదర్శి అశోక్, షకీల్, రామలింగం, తదితరులు ఉన్నారు.



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నోముల భగత్

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భగవాన్‌నాయక్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భగవాన్‌నాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసి రోజులు గడుస్తున్నా లారీల కొరతతో ధాన్యం బస్తాలు ఎక్కడివి అక్కడే ఉన్నాయని, మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేయకుండా తాలు పేరుతో రైతుల వద్ద క్వింటాకు ఐదు నుంచి పది కేజీల వరకు కట్ చేస్తున్నారని డొక్కలబావితండా సర్పంచ్ సఫావత్ జ్యోతిశంకర్‌నాయక్, లీలావత్ కోట్యానాయక్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె నిర్వహిస్తుండంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందని, ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ అకౌంట్లో జమ అయ్యాయని వాటిని డ్రా చేయాలంటే కార్యదర్శులు అవసరమన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల సమస్యలపై ప్రస్తావించారు. సమావేశంలో జెడ్పీటీసీ ఆంగోతు సూర్యబాషానాయక్, హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఖాజా అస్గర్‌ఆలీ, ఎంపీఓ పద్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులపై కనికరం చూపని ప్రభుత్వం



దామరచర్లలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మిర్యాలగూడ : మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వం రైతులపై ఎలాంటి కనికరం చూపిస్తుందో అర్థమవుతుందని దామరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దామరచర్ల సబ్‌మార్కెట్ యార్డులోని ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యం తీసుకొచ్చి 45రోజులు అయినప్పటికీ కాంటాలు వేయకపోవడంతో అకాల వర్షాలకు తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో నాగునాయక్, భిక్షంచారి, కుర్ర నాగరాజు, సీతారాంరెడ్డి, కృష్ణనాయక్, శివనాయక్, నాగరాజు, హరిప్రసాద్, ఖాదర్, ఆనంద్, సిపాయి నాయక్, గోపాల్, దాసు తదితరులు పాల్గొన్నారు.


ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

మిర్యాలగూడ : కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అవంతీపురం మార్కెట్ యార్డులో ధాన్యాన్ని ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులకు కనీసం టార్పాలిన్లు కూడా అందించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తలకొప్పుల సైదులు, పొలగాని వెంకటేష్‌గౌడ్, నాయకులు మహమ్మద్‌గౌస్, ఇమ్రాన్, అజయ్, శ్రీనివాస్, రవ, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : తేమ, తాలు పేరుతో జాప్యం చేయకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ గిరిజన ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ కిషన్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నఅడిశర్లపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట నేనావత్ లక్కునాయక్, రమేశ్‌నాయక్, నాగరాజు, కుమార్, శ్రీనివాస్, నాగరాజు, వెంకన్న, పాపానాయక్, మురళీ, పద్మ తదితరులున్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

త్రిపురారం : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, పద్ధతి మార్చుకొని నిబంధనల ప్రకారం కాంటాలు నిర్వహించాలని ఎంపీపీ అనుముల పాండమ్మ హెచ్చరించారు. మండలంలోని రాగడపలో త్రిపురారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అధికంగా తూకాలు వేసి బస్తాలు మిల్లుకు తరలించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీపీ కాంటా బస్తాలను తూకం వేయడంతో 1కిలో నుంచి 2 కిలోల వరకు అధిక తూకం రావడంతో తూకం అధికంగా వేసిన మిల్లుల వద్ద ఎందుకు షార్టేజీ చూపిస్తున్నారని, రైతులను ఎందుకు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవికుమార్, వెంకట్‌రెడ్డి, జానయ్య రైతులు పాల్గొన్నారు.



త్రిపురారం : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న ఎంపీపీ పాండమ్మ

ప్రతిధాన్యం గింజనూ ప్రభుత్వమే కొంటుంది

మాడుగులపల్లి : రైతులు పండించిన ప్రతిధాన్యం గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గంధ్రవానిగూడెం, కుక్కడం, చెరువుపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ రాములుగౌడ్‌తో కలిసి పరిశీలించి ఆయన మాట్లాడారు. లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుందని విషయాన్ని ఎమ్మెల్యే భాస్కర్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే సివిల్ సప్లయ్ అధికారులు, లారీ యజమానులతో మాట్లాడి కొనుగోళ్ల వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. రైతులెవ్వరూ అధైర్యపడొద్దని ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న కార్యదర్శుల నిరవధిక సమ్మె

మిర్యాలగూడ టౌన్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఐదోరోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు తమ పార్టీ మద్దతు ఎప్పుడు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నెల్లూరు దుర్గాప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాసుల సత్యం, జడ రాములుయాదవ్, మాన్యానాయక్, సైదానాయక్, జానిమియా, రసూల్, శ్రీనివాస్,శ్రీను, రాంరెడ్డి, జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

మిర్యాలగూడ : జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని దామరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో జేపీఎస్‌లు చేపడుతున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌లతో వెట్టిచాకిరీ చేయిస్తూ వారికి సరైన ఉద్యోగ భద్రతను ప్రభుత్వం కల్పించకపోవడం దారుణమన్నారు. జేపీఎస్‌లను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేసి పేస్కేల్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిపాయినాయక్, హరిప్రసాద్, ఖాదర్, గోపాల్, దాసు, నాగునాయక్, శివకుమార్, శివచరణ్, జేపీఎస్‌లు నరేష్, సాయికుమార్, నాగరాజు, రమేష్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తమ హక్కుల సాధన కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న సమ్మె మంగళవారం జోరు వానలోనూ కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు జేపీఎస్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ విధంగా తమను రెగ్యులరైజ్ చేయాలని, నాలుగేండ్ల ప్రొబేషనరి కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని, ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చి వారిని సైతం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, కోల సాయికుమార్, నాగరాజు, శ్రీను, మహేష్, కృష్ణ, నవీన్, సుధాకర్, శారద, రేవతి పాల్గొన్నారు.

మాడుగులపల్లి : రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఐదోరోజు చేరింది. ఈ సమ్మెకు టీడీపీ నాయకులు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేపీఎస్ మండల అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, ఆసీఫ్, విక్రమ్, కావ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ కార్యదర్శులు

హాలియా : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని అనుముల మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఐదోరోజుకు చేరింది. వారికి అనుముల మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పెరుమాళ్ల వెంకన్న, రియాజ్, లక్ష్మీనారాయణ, గోవర్ధన్, గిరి, రాము, జాన్, శ్రీనివాస్, సంతోష్, సుహాసిని, సునీత, మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

డిండి : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేణు, హరి, శ్రీను, రాము, రహీం, యాదగిరి, తాహీర్, నాగేంద్రమ్మ, శిరీష, నవియా తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో జేపీఎస్‌ల నిరసన

దేవరకొండ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఐదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా కళ్లకు గంతలు కట్టుకొని తమ నిరసన తెలిపారు. అనంతరం పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రొబేషన్ కాలం పూర్తైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, విజయ్, సంధ్య, స్వామి, అనిల్, హరిత ఉన్నారు.



మిర్యాలగూడ : సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న గాజుల శ్రీనివాస్



హాలియాలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న కార్యదర్శులు

సమ్మెకు సంఘీభావం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 5వ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన వారిలో నాయకులు కాసర్ల వెంకటేశ్వర్లు, జగన్‌నాయక్, సుమలత, భాస్కర్, ముడావత్ మంగ్యానాయక్, కందుల వెంకట్‌రెడ్డి, రమేశ్, శంకర్‌నాయక్, సుక్య, ఎండీ.ఖదీర్, సేవానాయక్ తదితరులున్నారు.

గుర్రంపోడు : సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు మండల సర్పంచ్‌లు కంచర్ల జగదీశ్వర్‌రెడ్డి, కూర కవిత, సల్వాది నగేష్, జక్కల భాస్కర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్ మండల అధ్యక్షుడు నక్కా స్వామి, వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీను, సూదిని శేఖర్‌రెడ్డి, నాగరాజు, సతీష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాడుగులపల్లి : సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



మిర్యాలగూడ టౌన్ : సమ్మెలో మాట్లాడుతున్న నెల్లూరు దుర్గాప్రసాద్



గుర్రంపోడులో కార్యదర్శులకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న సర్పంచ్

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంపోడు : మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో జిల్లా క్రీడల యువజన శాఖ, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత ఫుట్‌బాల్ క్రీడా శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బొల్లు శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూరుమూల ప్రాంతమైన తానేదార్‌పల్లిలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని గ్రామ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ శిబిరం ఈనెల 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి మద్ది కరుణాకర్, వార్డు మెంబర్ మద్ది శంకర్, కోచ్ మద్ది సైదులు, ప్రణయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో నృత్య శిక్షణ..

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, సాయి సిద్ధార్థ హైస్కూల్‌లో వేసవి సెలవుల సందర్భంగా యువ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నృత్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని యువ డ్యాన్స్ అకాడమీ ఆర్గనైజర్ కొర్ర కోటేశ్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాగార్జునసాగర్‌లో బాస్కెట్ బాల్ శిక్షణ..

నాగార్జునసాగర్ : క్రీడాకారులు వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలని సాగర్ ఎస్‌ఐ రాంబాబు అన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ క్రీడా శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లుగా పీఈటీ కిరణ్ తెలిపారు. మే 31వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. వివరాలకు 9160494743ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుందరి, వ్యవహర్త విజయప్రభావతి, రిటైర్డ్ పీఈటీ అనురాధ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ : క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాంబాబు తదితరులు

బ్యాడ్మింటన్ క్యాంపు..

మిర్యాలగూడ టౌన్ : బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంపును చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పి.నవీన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.అంజయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో గల ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఇచ్చినందున చిన్నారులు సమయాన్ని వృథా చేయకుండా క్రీడలపై దృష్టి మళ్లించాలన్నారు. జూన్ 4వరకు ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరరీ లక్ష్మీనారాయణ, సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నారబోయిన ఈశ్వర్, బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ తదితరులున్నారు.



మిర్యాలగూడ టౌన్ : సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న డాక్టర్ అంజయ్య



కొండమల్లేపల్లి : నృత్య శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

'అఫ్రీన్‌ను ఇంటర్ చదివిస్తా'

నిడమనూరు : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన అఫ్రీన్‌కు ఇంటర్‌లో రెండు సంవత్సరాలకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని అదే గ్రామానికి చెందిన పటాన్‌చెరువు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం భరోసా ఇచ్చారు. 9,10 తరగతి చదువుకు సహకరించిన ఆయనకు కృతజ్ఞతలు తెలపడానికి వెళ్లిన విద్యార్థి అఫ్రీన్ ఆమె తండ్రి ఇబ్రహీంకు ఇంటర్‌లో రెండు సంవత్సరాలకు అయ్యే ఖర్చును కూడా తానే భరిస్తానని వేణుగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన హామీ ఇవ్వడంతో ఇబ్రహీం ఆయన కూతురు అఫ్రీన్ హర్షం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధర్నా

నాంపల్లి : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హమాలీల కొరత, లారీ డ్రైవర్లు బస్తాకు రెండు రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం రైతులు ధర్నా చేపట్టారు. వ్యవసాయ అధికారులు ఒకేసారి 70 మంది రైతులకు టోకెన్లు ఇవ్వడంతో హమాలీల కొరత ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నాంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హమాలీలు రైతుల వద్ద వద్ద రూ.500 నుంచి రూ. 4వేల వరకు వసూలు చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు ఇచ్చిన టోకెన్ తీసుకుని రైతులు హమాలీల వద్దకు వెళితే కుప్పకు ఎంత ఇస్తారు, డబ్బులు ఇస్తేనే ముందు కాంటా వేస్తాం, లేకుండా వేరే రైతుల కుప్పలు కాంటా వేస్తామని పేర్కొంటున్నారు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో రైతులు చేసేది ఏమీలేక లేక హమాలీల చేతులు తడుపుతున్నారు. ఇదే అదనుగా లారీల డ్రైవర్లు 41 కేజీలు ఉన్న బస్తాకు రూ.2 చొప్పున ఇస్తేనే లోడ్ చేసుకుంటామని కొర్రీలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడ లేదని, ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతులు వెంకటయ్య, రాములు, దశరథ, పార్వతమ్మ, భారతమ్మ, నర్సిరెడ్డి తదితరులు ధర్నా చేశారు.